కారుకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలు డబుల్

● కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని ఆ పార్టీ అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో మహాంకాళి అమ్మ వారికి ప్రత్యేక పూజాలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. బుర్జుగల్లీ, చాకలి బస్తీ, పోచమ్మ బస్తీ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మావతి డీపీ రెడ్డిలతో పాటు పార్టీ శ్రేణులతో కలిసి ముమ్మర ప్రచారం చేశారు. ప్రతి ఇంట్లో ఓటర్లను కలిసి తనదైన శైలిలో ఆకట్టుకున్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు అవుతాయని హామీ ఇచ్చారు. మరోమారు ఓటు వేసి అండగా ఉంటే అంబర్‌పేట మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

ముషీరాబాద్ ఓటర్లు 3,01,788

● పెరిగిన 15 పోలింగ్ స్టేషన్లు, 105 పోలింగ్ కేంద్రాలు
● రేపటి నుంచి కొత్త ఓటరు జాబితా పంపిణీ


సమావేశంలో పాల్గొన్న డీఎంసీ తిప్పర్తి యాదయ్య, ఏఆర్‌వో, రాజకీయ పార్టీల ప్రతినిధులు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య ఖరారైంది. మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు తదితర మోడిఫికేషన్ల అనంతరం తుది జాబితాను జీహెచ్‌ఎంసీ విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం వివిధ రాజకీయ పార్టీలతో జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారులు పూర్తి వివరాలు వెల్లడించారు. మొత్తం ఓటర్లు 301788 కాగా. అందులో పురుషులు 155108 మంది కాగా మహిళా ఓటర్లు 146607 మంది, ఇతరులు 13 మంది ఉన్నారు. సీనియర్ సిటిజన్లు 6,780 మంది కాగా 18-20 సంవత్సరాల వయస్సు గల యువ ఓటర్లు 4568 మంది, దివ్యాంగులు 1659 మంది ఉన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రతి వెయ్యి మంది పురుషులకు 945 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు గుర్తించారు. గతంలో 274 పోలింగ్ స్టేషన్లు ఉండగా వాటి సంఖ్య 289కి పెరిగింది. అంటే 15 పోలింగ్ స్టేషన్లు పెరిగాయి. పోలింగ్ కేంద్రాలు గతంలో మాదిరిగానే 105 ఉన్నాయి. పెరిగిన 15 పోలింగ్ స్టేషన్‌లలో 14 పోలింగ్ స్టేషన్లను అదే కేంద్రాల్లో సర్దుబాటు చేయగా ఒకటి మాత్రం వేరే పోలింగ్ కేంద్రంలో సర్దుబాటు చేశారు. సంజీవయ్యనగర్ కమ్యూనిటీహాల్‌లో ప్రస్తుతం 129, 130 పోలింగ్ స్టేషన్లు ఉండగా అందులో 129, 129ఏ పోలింగ్ స్టేషన్లను అక్కడే ఉంచి 130వ నెంబర్ పోలింగ్ స్టేషన్‌ను మహాత్మనగర్ కమ్యూనిటీహాల్ పోలింగ్ కేంద్రానికి మార్చారు. ఇప్పటి వరకు 35 మంది నామినేషన్లు దాఖలు చేయగా, రెండు నామినేషన్లు తిరస్కరించబడ్డాయి. 33 మంది బరిలో ఉన్నారు. 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 డీఎంసీ తిప్పర్తి యాదయ్య, ఏఆర్‌వో, ఎన్నికల అధికారి భీమ్‌రావులతో పాటు బీఆర్‌ఎస్ నుంచి కొండపల్లి మాధవ్, శ్రీనివాస్‌గుప్తా, బీజేపీ నుంచి రమేష్‌రామ్, కాంగ్రెస్ నుంచి వాజీద్‌హుస్సేన్, టీడీపీ నుంచి చంద్రమోహన్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఒకటి రెండు రోజుల్లో అన్ని రాజకీయ పార్టీలకు కొత్త ఓటరు లిస్టులను పంపిణీ చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

అన్ని వర్గాల మద్దతుతో కాంగ్రెస్ విజయం ఖాయం


మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్

కవాడిగూడ: అన్ని వర్గాల ప్రజల, కుల సంఘాల మద్దతుతో ముషీరాబాద్ నియోజకవర్గంలో ఘన విజయం సాధిస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం. అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం కవాడిగూడ డివిజన్, లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నాయీ బ్రాహ్మణ సేవ సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం. అంజన్‌కుమార్ యాదవ్‌కు మద్దతుగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశానికి ఎం. అంజన్‌కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం. అనిల్ కుమార్ యాదవ్, సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.... రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే నాయీబ్రాహ్మణుల సమస్యలు, హక్కుల సాధన కోసం కృషిచేస్తానన్నారు. సంఘం నాయకులు కె.రాములు, ఎ. శ్రీనివాస్, జె. సత్యనారాయణ మాట్లాడుతూ.... ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నేతలు కె. సంపత్, ఎం. కిషన్, కె. వెంకటేష్, పి.సతీష్, ఎస్.దశరత్, కాంగ్రెస్ ఎ-బ్లాక్ అధ్యక్షుడు వి.డి.కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు పోతురాజు భాస్కర్, నాయకులు సి. లక్ష్మణ్, ఎం. ప్రభాకర్, సాయిబాబా, సూర్యచంద్రశేఖర్, రమేష్‌యాదవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

దోమలగూడలో కాంగ్రెస్ ప్రచారానికి విశేష స్పందన

కవాడిగూడ డివిజన్ దోమలగూడలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను గడపగడపకు వివరిస్తున్నామని, కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. కాంగ్రెస పార్టీకి ఒక్కసారి అవకాశం ఇస్తే అవినీతి రహిత పాలనతోపాటు ప్రజా సంక్షేమం, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అక్రమ పొత్తును ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ కార్యకర్తలకే పరిమితమయ్యాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ అభివృద్ధికి కృషి


సుందరయ్య పార్కులో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: త్వరలో జరగనున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ముషీరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్ కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో ప్రచారం చేశారు. అంతకు ముందు పార్కులోని తెల్ల ఉప్పలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వాకర్స్‌కు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎంపీగా తన హయాంలో ముషీరాబాద్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. తనను గెలిపిస్తే సుందరయ్య పార్కును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వాకర్స్‌కు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. సీనియర్ నాయకులు కాసాని ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లోకేష్‌యాదవ్, బి-బ్లాక్ అధ్యక్షులు అంజియాదవ్, సుందరయ్య పార్కు అధ్యక్షులు ఎస్.రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, పార్కు మాజీ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తోట శ్రీను, విజయ్‌కుమార్, రవి, శ్యామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ ఎన్నికల కార్యాలయాన్ని ఏక్ మినార్ వద్ద మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఒక్కటే లౌకిక వాద పార్టీ అన్నారు. దేశంలో ముస్లీం, క్రిస్టియన్, మైనార్టీలు, మనుగడ సాధించాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. బీజేపీ పాలనలో క్రిస్టియన్, ముస్లీం మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. పాలస్తీనాలో ఆసుపత్రులు, పాఠశాలలపై ఇజ్రాయిల్ దాడులు చేస్తున్నా బీజేపీ ప్రభుత్వం వారికి మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి ఓటర్ స్లిప్‌లు అందాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌వో మారుతీ దివాకర్

అంబర్‌పేట: ప్రతి ఓటరుకు ఓటర్ స్లిప్పులు అందేలా చర్యలు తీసుకున్నట్లు అంబర్‌పేట నియోజకవర్గ ఎన్నికల ఈఆర్‌వో మారుతీ దివాకర్ తెలిపారు. మంగళవారం బూత్ లెవల్ అధికారులతో నారాయణ గూడ రెడ్డి కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 2.70 లక్షల ఓటర్లకు ఓటర్ స్లిప్‌లను అందించే బాధ్యత బీఎల్‌వోలదేనని స్పష్టం చేశారు. ప్రింటింగ్ ఓటర్ స్లిప్‌లు అందించి ఓటర్ ఆధార్, ఓటర్‌కార్డు నంబర్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 20, 21 లోగా ఓటర్ స్లిప్‌ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఓటర్ స్లిప్పులను పార్టీ నేతలకు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వకూడదన్నారు. ఓటర్ స్లిప్పులు అందని వారు సంబంధిత పోలింగ్ కేంద్రంలో సంప్రదిస్తే సంబందిత బిఎల్‌వో వారికి అందిస్తారని తెలిపారు.

సీపీఎం నేతల ముమ్మర ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న సీపీఎం నేతలు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లో మంగళవారం సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. జాంభవీనగర్, ఎంసీహెచ్ కాలనీ, గంగపుత్ర కాలనీ, భరత్‌నగర్, అంబేద్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను సిపిఎం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీలను నమ్మరాదని, తమ సొంత ప్రయోజనాల కోసం ప్రజలను విస్మరిస్తున్న వారికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న మద్దెల ధశరథ్‌ను ముషీరాబాద్ ప్రజలు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పద్మ, అజయ్‌బాబు, అరుణ్‌జ్యోతి, శ్రీరాములు, ఆంజనేయులు, మహేష్, రాఘవేందర్, రజియా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం ప్రారంభం



ఎన్టీఆర్ స్టేడియంలో భక్తి టీవీ ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం హంస వాహనంపై ఉత్సవమూర్తులు దర్శనమిచ్చారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ సుధా, ఎన్‌టీవీ, భక్తి టీవీ అధినేత నరేంద్ర చౌదరి తదితరులు పాల్గొన్నారు. -కవాడిగూడ



కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల డీఎన్‌ఏ ఒక్కటే


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ముషీరాబాద్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు వేర్వేరు అయినా వాటి డీఎన్‌ఏ ఒకటే అని ఈ రెండు పార్టీలను మజ్లిస్ నడిపిస్తుందని రాజ్యసభ సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ఆయన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి భోలక్‌పూర్‌లో బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ 60 కోట్ల మంది పేదలకు ఉచితంగా బ్యాంక్ అకౌంట్ తెరిపించి రూ. 27 లక్షల కోట్ల నిధులను వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ చేశారన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధే నేటికి కనిపిస్తుందన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలని, ఆకాంక్షలకు విరుద్ధంగా కేసీఆర్ వ్యవహరిస్తున్నందున ప్రజలు మార్పును కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి పూస రాజు, జన సేన ముషీరాబాద్ ఇన్‌చార్జీ బిట్ల రమేష్, కార్పొరేటర్లు కె.రవిచారి, సుప్రియానవీన్‌గౌడ్, రచనశ్రీ, అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, డివిజన్ ఎలక్షన్స్ ఇన్‌చార్జీలు పార్థసారధి, చంద్రమౌలి, గోపాల్‌రెడ్డి, గంగపుత్ర సంఘం నాయకులు శ్రీహరి, అమృతరాజ్, శివరత్నం పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి


దుర్గనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి కృష్ణయాదవ్

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధి తన హయాంలోనే జరిగిందని, ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి తనను గెలిపిస్తే తిరిగి మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ అభ్యర్థి కృష్ణయాదవ్ అన్నారు. మంగళవారం గోల్నాక డివిజన్ అంబేడ్కర్ నగర్, దుర్గనగర్ తదితర ప్రాంతాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన పాత పరిచయస్తులను పలకరిస్తూ ఎన్నికల్లో నిలబడ్డానని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు మోసపూరిత మాటలు చెబుతాయని వాటిని నమ్మవద్దన్నారు. ఒక్కసారి ఓటు వేసి గెలిపిస్తే అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

బీజేపీ అభ్యర్థి పూస రాజుకు గంగపుత్ర సంఘాల మద్దతు


పూస రాజుకు మద్దతు ప్రకటిస్తున్న గంగపుత్ర సంఘాల నేతలు

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం గంగపుత్రులకు వ్యతిరేకంగా అనేక జీవోలు తీసుకువచ్చినా వాటిని తిప్పికొట్టడంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ విఫలమయ్యారని, అసెంబ్లీలో మన గళం గట్టిగా వినిపించాలంటే ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూస రాజును గెలిపించాలని గంగపుత్ర సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ ఎన్నికల కార్యాలయంలో జరిగిన గంగపుత్రుల సంఘం సమావేశంలో పూస రాజుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్న ప్రదేశ్ గంగపుత్ర సంఘం, నగర గంగపుత్ర సంఘాలు స్పష్టం చేశాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గంగపుత్రులకు వచ్చిన అవకాశాన్ని వదులుకోవద్దని, జాతీయ పార్టీ నుంచి పూస రాజుకు టికెట్ రావడం గర్వకారణమన్నారు. గతంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌కు మద్దతు ప్రకటించినా ఆయన తమకు చేసిందేమీ లేదన్నారు. బీజేపీ అడ్డాగా గుర్తింపు పొందిన ముషీరాబాద్‌లో డాక్టర్ కె.లక్ష్మణ్ త్యాగం చేసి ఆ సీటును గంగపుత్రులకు ఇవ్వడం అభినందనీయమన్నారు. ముషీరాబాద్ అభ్యర్థి పూస రాజు మాట్లాడుతూ గంగపుత్రులను గెలిపిస్తే ముఖ్యమంత్రి బానిసగా మారారని కుల బంధువులకు ఏమీ చేయలేదన్నారు. బీజేపీ ఫిషర్‌మెన్ సెల్ అధ్యక్షులు కాపర్తి మోహనకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు గడప శ్రీహరి, చాట్ల సదానంద్, దేశబోయిన రఘు, చంద్రమౌలి, పిల్లి శంకర్, శివరత్నం, భగవతి, సంగీత, సంజన, పూస రాకేష్, ఏఎల్ సుధాకర్, పూస శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్ రెడ్డి

కాచిగూడ: ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధిచేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కాచిగూడ డివిజన్, నింబోలిఅడ్డ మమంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. తెలంగాణ బాగుపడాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలని, ప్రతి ఒక్కరూ చేతిగుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. మహంకాళి టెంపుల్, సంఘం హోటల్ లేన్, కామ్‌గార్‌నగర్ బస్తీ, టక్కీ జైల్, హరాస్‌పెంట, వడ్డెర బస్తీ తదితర ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు హరాజ్‌వాలే హరితిలక్ సింగ్, కోమల్ సింగ్, టిల్లు, లక్ష్మణ్ యాదవ్, శంబుల శ్రీకాంత్ గౌడ్, చందర్, రాంమోహన్, ఫరీద్, సర్వరాజ్, అభిజిత్ యాదవ్, సుదర్శన్, శ్రీకాంత్, తోట జగన్నాథం, శ్యాంరావు, సతీష్ కుమార్, రాంమోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా


భోలక్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: ఐదేళ్లలో ముషీరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానని, రెండో సారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని బీఆర్‌ఎస్ ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం ఆయన భోలక్‌పూర్ డివిజన్‌లోని బాకారం మల్లన్న దేవాలయం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంచుతూ బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భోలక్‌పూర్‌లో కలుషిత నీటి నివారణ, పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైపులైన్ల ఆధునికీకరణ, మోడల్ రోడ్లు వేసి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దామన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని, మూడోసారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఏర్పాటు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, సీనియర్ నాయకులు బింగి నవీన్, రెబ్బరామారావు, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు షరీఫ్, రహీం, డివిజన్ బీసీ సెల్ అధ్యక్షులు ఉమాకాంత్, నాయకులు కృష్ణ, మహేష్, మహ్మద్‌అలీ, శంకర్‌గౌడ్, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదిగల ఓట్ల కోసమే మోదీ మొసలి కన్నీరు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాదిగల ఓట్ల కోసమే ప్రధాని మోదీ మొసలి కన్నీరు కారుస్తున్నారని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు అన్నారు. పదేళ్లలో పార్లమెంటులో మెజార్టీ ఉన్నా బీజేపీ వర్గీకరణ బిల్లు ఎందుకు ప్రవేశపెట్టలేదన్నారు. మంగళవారం చిక్కడపల్లిలోని కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మోదీ కమిటి వేస్తున్నట్లు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కమిటి అంటే కాలయాపన తప్ప మరొకటి కాదన్నారు. మాదిగల ఆత్మగౌరవాన్ని మనువాద బీజేపీకి తాకట్టు పెడుతున్న మందకృష్ణమాదిగ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగంలో రోజుకు ఒక పేజీ చింపుతున్న బీజేపీ మనువాదం వైపు మాదిగలను నడిపించే కుట్ర చేస్తున్నారని దీనిని అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఇఫ్లూ ఘటనలో దోషులను శిక్షించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇఫ్లూ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మానవ హక్కుల కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇఫ్లులో అక్టోబర్ 18న విద్యార్థినిపై లైంగిక వేధింపులు జరిగినప్పటికి ఇప్పటి వరకు నిందితులను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల అరెస్టులను నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి, ఉపాధ్యక్షులు కె.ఎస్.ఆశలత, వి.కవిత తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస పూజలు ప్రారంభం



నల్లకుంట: కార్తీక మాసం తొలిరోజు మంగళవారం నల్లకుంటలోని శ్రీ సీతా రామాంజనేయ సరస్వతి దేవాలయం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని పర్వత వర్ధిని సహిత రామ లింగేశ్వర స్వామి ఆలయంలో శివుడికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

ముదిరాజ్‌ల స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బాలకృష్ణయ్య

కాచిగూడ: నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరుడు, సామాజికవేత్త డాక్టర్ బాలకృష్ణయ్య ముదిరాజ్‌లకు అందించిన సేవలు చిరస్మరణీయమని అఖిల భారత ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ అన్నారు. డాక్టర్ బాలకృష్ణయ్య ముదిరాజ్ జయంతి సందర్భంగా మంగళవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలకృష్ణయ్య చిత్రపటానికి పలువురు నేతలు పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముదిరాజ్‌లకు బాలకృష్ణయ్య స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉదయశ్రీ, సురేష్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, వసంత, రజని తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన అలవాట్లు చేసుకోవాలి

కాచిగూడ: ప్రజలు ఆరోగ్యకరమైన అలవాట్లను చేసుకోవాలని, శారీరక వ్యాయామం, యోగ తదితరాలు నిత్య జీవితంలో భాగం చేసుకుంటే మధుమేహం సంబంధిత సమస్యల నుంచి గట్టెక్కవచ్చునని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని ఉడ్ ల్యాండ్స్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన 'డయాబెటిక్ సెంటర్'ను ఆయన ప్రారంభించారు. డా.ఎల్.సురేష్ గౌడ్, డా.కేవీఆర్ శాస్త్రీ, డా.జీసీ రెడ్డి, డా.విజయ్ మోహన్ పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

బీఆర్‌ఎస్ హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముఠాగోపాల్

చిక్కడపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరాయని బీఆర్‌ఎస్ ముషీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ముషీరాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించానని మరో సారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ప్రచారానికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో నియోజవర్గాన్ని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రతి గల్లీలో వీడీసీసీ రోడ్లు, నూతన మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్ వేయించడం జరిగిందన్నారు. మురికికూపంగా ఉన్న ముషీరాబాద్‌ను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. ప్రజలకు 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న తనను ప్రజలు మరో సారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ ఇన్‌చార్జీలు అజయ్‌ముదిరాజ్, బొట్టుశ్రీను, పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు ముఠాపద్మా, బీఎన్ శ్రీనివాస్‌రావుయాదవ్, ముఠా నరేశ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, గడ్డమీద శ్రీనివాస్, రవిశంకర్ గుప్తా, బత్తుల కిరణ్, సత్యనారాయణ, పాశం రవి, ఎస్ప్రేమ్, శ్రీధర్‌రెడ్డి, చాణిక్యరెడ్డి, దేవయ్య, భాస్కర్‌రెడ్డి, భాస్కర్, హన్మంతు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గూటికి బీసీ సంఘం నేత భూపేష్ సాగర్



కాచిగూడ: బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు భూపేష్ సాగర్ మంగళవారం తన అనుచరులతో కలిసి రాష్ట్ర మంత్రి టి.హరీష్ రావు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా భూపేష్ సాగర్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిపై బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధి అసమానమైనదన్నారు. భవిష్యత్తుపై కేసీఆర్‌కు స్పష్టత ఉందన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో సందీప్ రెడ్డి, టి.రాజ్‌కుమార్, విజయేందర్ సాగర్, సుమన్ గౌడ్, సోను, సుమన్‌సింగ్, శ్రీకాంత్, నవీన్, రాకేష్ దత్త, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నల్లకుంటలో ఎమ్మెల్యే సతీమణి ప్రచారం


నల్లకుంటలో ప్రచారం చేస్తున్న కాలేరు పద్మ

నల్లకుంట: అంబర్‌పేట నియోజక వర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్‌కు మద్దతుగా ఆయన సతీమణి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ మంగళవారం న్యూ నల్లకుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి మహిళా ఓటర్లను కలిసి నియోజక వర్గంలో ఎమ్మెల్యే కాలేరు చేసిన అభివృద్ధిని వివరిస్తూ బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సాయిమోహన్, గాలపల్లి శంకర్, ఇర్షాన సుల్తాన, వన్నాడి రమ్య, క్రిసోలైట్‌తో పాటు వందలాదిగా మహిళలు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383